సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 13 । జూన్ । 2023



హోంగార్డు దుర్మరణం

సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు నబ్బవరపు కుమారస్వామి మృతి చెందారు. 8లో



బదిలీల సందడి

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం బదిలీ చేస్తున్నారు. 8లో



పరిశుభ్రతకు ప్రాధాన్యం

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

శంకరమఠంలో శ్రీరామ పాదుకలు



శ్రీరామ పాదుకలు

సీతంపేట : అయోధ్యలో ప్రతిష్ఠించనున్న శ్రీరాముని పాదుకలు భక్తుల సందర్శనార్థం స్థానిక శంకరమఠంలో ఉంచారు. సోమవారం ఉదయం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు పాదుకలను దర్శించారు. ముందుగా వేద పండితులు పూజలు చేశారు. ఈ సందర్భంగా పాదుకలను తయారు చేయించిన శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ 8 కిలోల వెండి, దానిపై బంగారు తొడుగు కూడా చేయించానన్నారు. ఏడాదిన్నర కాలంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాలలో శ్రీరామ పాదుకలను భక్తుల సందర్శనార్థం ఉంచి, అక్కడి వేద పండితులు, అర్చకులతో పూజలు చేయిస్తున్నట్టు తెలిపారు. పుణ్యక్షేత్రాలలో పూజలు చేసిన తర్వాత నవంబర్ ఒకటిన భద్రాచలం నుంచి చత్రపూర్ మీదుగా పాదయాత్రగా బయలుదేరి అయోధ్యకు చేరుకొని జనవరి 26న పాదుకలు ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు.

నేడు పైడితల్లి పండగ మహోత్సవం



పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి వార్షిక పండగ మంగళవారం వైభవంగా జరగనుంది. ఈ మేరకు సింహాచలం దేవస్థానం, అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామ సంప్రదాయం ప్రకారం సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం గాంధీనగర్‌లోని శతకంపట్టు వద్ద అంజలి రథ సేవ తదితర సేవలను నిర్వహించనున్నారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని నిర్వహిస్తారు. అనుపోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం ఏర్పాటు చేసింది. దారి పొడవునా విద్యుద్దీపాలంకరణ చేసింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, అమ్మవారి పూజారి వంశీయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్కూల్ బస్సుల తనిఖీలు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సుల తనిఖీలు చేపట్టారు. ఎన్ఏడీ జంక్షన్, మద్దిలపాలెం, బోయపాలెం, గాజువాక, శీలానగర్, బీచ్ రోడ్డు, చావుల మదుం జంక్షన్ ప్రాంతాల్లో 400కి పైగా బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ బస్సులన్నీ ఫిట్‌గా ఉన్నాయని అధికారులు తెలిపారు. తనిఖీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, బాలాజీరావు, హరిప్రసాద్, మన్మోహన్, శ్రీనివాసయాదవ్, పి.శిరీష, సత్యంనాయుడు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో వాణిశ్రీ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం సినీ నటి వాణిశ్రీ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నిషేధిత ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలపై సోమవారం దాడులు నిర్వహించాయి. ఆయా దుకాణదారుల నుంచి రూ.71,300 అపరాధ రుసుం వసూలు చేయడమే గాక, 64.10 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నట్లు అదనపు కమిషనర్ తెలిపారు. నగర పరిధిలోని దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్ విక్రయించడం, వాడకం చేసినట్టయితే అపరాధ రుసుము వసూలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వడివడిగా బడికి..

- జిల్లాలో తెరుచుకున్న పాఠశాలలు
- వేడుకగా జగనన్న విద్యాకానుక పంపిణీ



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆనందహేల

బడిగంట గణగణమోగింది.. అప్పటికే కిలకిలమంటూ చిన్నారులు చేరుకున్నారు.. పాత తరగతి గదిని చూసి, గతేడాది జ్ఞాపకాలను ఒక్క క్షణం అవలోకించి, కొత్త క్లాసు రూములోకి పరుగులు తీశారు.. మొదటి రోజునే జగనన్న విద్యాదీవెన కిట్‌లు అందుకోవడం వారిలో ఆనందం నింపింది.. కొత్త పుస్తకాలను చూసి నూతనోత్సాహం పొంగుకొచ్చింది.. అక్కడే చకచకా చదివేయాలనిపించింది వారికి. ఉపాధ్యాయులు తొలి రోజునే బోధనకు శ్రీకారం చుట్టారు.. క్లాస్ అయ్యాక సెలవుల్లో ఎలా కాలక్షేపం చేశారో కబుర్లు చెప్పుకుంటూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు.. మళ్లీ గంట మోగగానే ఇంటి దారి పట్టారు.. ఇవీ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనిపించిన తొలి రోజు దృశ్యాలు. – విశాఖ విద్య





జగనన్న గోరుముద్ద: పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు



విద్యా కానుకలతో మురిసెన్



స్కూలుకు పోదాం చలోచలో : కేడీపీఎం మున్సిపల్ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు



చదువుకు శ్రీకారం: విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు



చదువులు ముగించుకొని ఇంటి బాట

ప్రపంచంతో పోటీపడండి

- విద్యతోనే ఉన్నత శిఖరాలకు..
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- విద్యార్థులకు విద్యాకానుక పంపిణీ

తగరపువలస : ప్రపంచంతో పోటీపడే స్థాయికి రాష్ట్రంలో పేద విద్యార్థులు చేరుకోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. జగనన్న విద్యా కానుక నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో ప్రారంభించారు. జిల్లాలో 611 పాఠశాలల్లోని 87,413 మంది విద్యార్థులకు గాను రూ.21.14 కోట్ల విలువైన జగనన్న విద్యాకానుకలను పాఠశాలల పునఃప్రారంభం రోజునే పంపిణీ చేస్తుండడం ముఖ్యమంత్రికి విద్యార్థుల పట్ల ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమన్నారు. విద్య, వైద్యానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యత దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వడం లేదన్నారు. మానవ వనరుల అభివృద్ధికి భవిష్యత్తులో మరింత దృష్టి సారించనున్నారన్నారు. ఏడాది పాటు తల్లిదండ్రులపై భారం పడకుండా విద్యాకానుకల పేరుతో బూట్లు, స్టేషనరీ, యూనిఫాంలు అందించారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే నాణ్యమైన పౌష్టికాహారం అందించడం కోసం జగనన్న గోరుముద్దపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ నిర్ణయాలకు అండగా ఉండాలన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ 3వ తరగతి నుంచి టోఫెల్ వంటి పోటీ పరీక్షలు ఎదుర్కొనేందుకు గాను మండల, జిల్లా స్థాయిలో ప్రయోగాత్మకంగా శిక్షణా సంస్థలు ప్రారంభించనున్నామన్నారు. గ్లోబల్ కాంపిటీషన్‌ను తట్టుకునేలా బైజూస్ కంటెంట్ పాఠ్యాంశాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్,ఎంఈవో కేపీ బాలామణి, బాలల హక్కుల సంఘం ప్రతినిధి గొండు సీతారాం, హెచ్‌ఎంలు పొట్నూరు మురళీ మోహనరావు, సీహెచ్.రోజామణి పాల్గొన్నారు.



విద్యార్థినికి జగనన్న విద్యాకానుక అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



జగనన్న ఆణిముత్యాలు అవార్డు అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విద్యాభివృద్ధికి రూ.50వేల కోట్లు

దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఆయన, కలెక్టర్ వేర్వేరుగా విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల అవార్డులు, విద్యాకానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీపడాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, కార్పొరేటర్ అక్కరమాని పద్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు పాల్గొన్నారు.



చిట్టివలసలో జగనన్న విద్యా కానుక అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తొలిరోజే గిఫ్ట్ అందించారు



పాఠశాలలు ప్రారంభించిన రోజే విద్యాకానుకల పేరుతో ఏడాదికి సరిపడా 9 వస్తువులు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయన కలను నేరవేర్చి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటుతాం.

– కంచుపర్తి దీపిక, 10వ తరగతి, తగరపువలస

విద్యార్థులపై ఖర్చు భారం అనుకోలేదు..



జగన్ మామయ్య విద్యార్థుల కోసం పెట్టిన ఖర్చును భారంగా భావించలేదు. అందుకే మాకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, బ్యాగులు తదితర 9 వస్తువులు అందించారు. త్వరలో అమ్మఒడి ద్వారా రూ.15వేలు కూడా ఇవ్వనున్నారు.

– గంటా పవన్ కుమార్, 10వ తరగతి, చిప్పాడ

అందమైన ఏకరూప దుస్తులు



తల్లిదండ్రులు మాదిరిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మా మనసెరిగి మంచి ఏకరూప దుస్తులు అందించారు. ఇవి గత ఏడాది కంటే చాలా అందంగా ఉన్నాయి. వీటితో మాలో రెట్టింపు ఉత్సాహం కలుగుతోంది.

– జి.గీత, 8వ తరగతి, అగనంపూడి హైస్కూల్

సమయం, డబ్బులు ఆదా



గతంలో పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు మండల కేంద్రంలో స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు విడతల వారీగా తరలించడానికి రూ.4వేలకు పైగా రవాణా ఖర్చులు అయ్యేవి. ఇప్పుడు నేరుగా స్కూల్‌కే విద్యాకానుకలు పంపిస్తున్నారు. సమయం, డబ్బులు ఆదా అవుతున్నాయి.

– వై.జగన్నాథస్వామి, ప్రధానోపాధ్యాయులు, సంతపేట అంబేడ్కర్ హైస్కూల్

రవాణా భారం తప్పింది..



విద్యా కానుక కిట్లు గతంలో మండల హెడ్ క్వార్టర్స్‌లోని ఎంఆర్సీల నుంచి ప్రైవేటు వాహనాల ద్వారా పాఠశాలకు తీసుకొని వెళ్లాల్సి వచ్చేది. ఈ ఏడాది పాఠశాలలపై భారం పడకుండా నేరుగా పాఠశాలల వద్దకే కిట్లు అందిస్తున్నారు. సిబ్బందిపై అదనపు భారం తప్పింది.

– శిష్ల ఖగేశ్వరరావు, సైన్స్ టీచర్, అగనంపూడి

ఉపయుక్తంగా జేవీకే కిట్



పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్ అందించారు. అన్నీ ఎంతో నాణ్యంగా ఉన్నాయి. మాకు అవసరమైన నోట్ పుస్తకాలు సైతం అందించారు. ఈ సంవత్సరం అందించిన యూనిఫారం కూడా చాలా బాగుంది. జేవీకే కిట్ ఎంతో ఉపయుక్తంగా ఉంది.

– పి.సౌజన్య, ఎ.రాజరాజేశ్వరి, కేడీపీఎం పాఠశాల

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు

- నైపుణ్యాలతో అనుసంధానం చేయాలి
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

ఏయూక్యాంపస్ : యువతను నైపుణ్యాలతో అనుసంధానం, సుసంపన్నం చేయడం వల్ల మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో అనుసంధాన్ యువ ప్రీమియర్, వెబ్ సైట్, బ్రోచర్, టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా పనిచేస్తున్నారన్నారు. ప్రతీ జిల్లాలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. స్టార్టప్‌ను స్థాపించే వారికి మంచి ప్రేరణగా, మార్గదర్శకంగా అనుసంధాన్ యువత నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎం.పీ ఎంవీవీ సత్యనారాయణ, ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, ఏపీఐసీ జేడీ లావణ్య, ఏపీఈఐటీఏ గ్రూప్ సీఈవో ఎస్.కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్ఆర్‌డీసీ ప్రతినిధి డాక్టర్ బిజయ్ కుమార్ సాహు, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అనుసంధాన్ యువ నిర్వాహకుడు ఏ.సుభాష్, సతీష్, ఓఆర్ఎం రావు, జి.ఎస్.ఎన్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పీల వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, వీసీ ప్రసాదరెడ్డి, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆటోనగర్ వాసీవా అధ్యక్షుడిగా పాండురంగ ప్రసాద్



పాండురంగ ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీయలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడిగా డాక్టర్ సజ్జా పాండురంగ ప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం సాయంత్రం వాసీవా భవనంలో జరిగిన పారిశ్రామికవేత్తల జనరల్ బాడీ సమావేశంలో ఎన్నికల నియామక ప్రక్రియను నిర్వహించారు. వాసీవా మాజీ అధ్యక్షుడు ఏ.కె.బాలాజీ అధ్యక్షతన మాజీ ఐలా చైర్మన్ ఎస్.శేషగిరిరావు, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, పరిశ్రమల శాఖ మాజీ జీఎం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అధ్యక్ష బరిలో ఐలా మాజీ ఉపాధ్యక్షుడు ఈ.కృష్ణ ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్ గౌరవాధ్యక్షుడు అనార్‌బాబు, సజ్జా పాండురంగ ప్రసాద్‌లు ఉండగా కమిటీ తీసుకున్న నిర్ణయంతో వీరిలో సజ్జా పాండురంగ ప్రసాద్‌ను వాసీవా అధ్యక్షుడిగా నియమిస్తూ తీర్మానం చేశారు. మిగిలిన నూతన కార్యవర్గాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. రెండేళ్ల పాటు వాసీవా నూతన కమిటీ తమ సేవలను అందించనుందని కమిటీ తెలిపింది.

ప్రాణం లేచి వచ్చింది..!

- ఒక్కసారిగా క్షీణించిన ఉష్ణోగ్రతలు
- ఒక్కరోజులో 8 డిగ్రీల వ్యత్యాసం
- వడగాడ్పుల నుంచి ఉపశమనం
- విశాఖపై నైరుతి గాలుల ప్రభావం



విశాఖలో ఉష్ణోగ్రతలు

తేది	ఉష్ణోగ్రత
6.6.23	40.0
7.6.23	40.0
8.6.23	42.0
9.6.23	42.0
10.6.23	44.6
11.6.23	43.6
12.6.23	36.2

సాక్షి, విశాఖపట్నం: దాదాపు మూడు వారాల నుంచి విశాఖ మలమల మాడుతోంది. ప్రతిరోజూ మండే సూర్యుడు నడినెత్తిపైనే ఉన్నట్టు అనుభూతి కలుగుతోంది. ఉష్ణతాపం హద్దులు మీరుతూ వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులకు కారణమవుతోంది. ఐదారు రోజుల నుంచి పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. దీంతో విశాఖ నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు గతి తప్పుతూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. భగభగలతో జనాన్ని భయకంపితులను చేస్తున్నాయి. రోహిణి కార్తె ఆరంభం (గత నెల 25) నుంచే వడగాడ్పులు దడ పుట్టించాయి. ఇక మృగశిర కార్తె వస్తే వాతావరణం చల్లబడుతుందని ఆశించిన వారికి రోహిణికి మించిన ఎండలు, తీవ్ర వడగాడ్పులు బేజారెత్తించాయి. ఈనెల 8 నుంచి మృగశిర కార్తె ప్రవేశించినా ఉష్ణోగ్రతలు మరింత ఉగ్రరూపం దాల్చాయి. విశాఖలో ఈనెల 44.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది 28 ఏళ్ల తర్వాత జూన్‌లో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత. సాధారణంకంటే ఇది 10 డిగ్రీలు అధికమన్న మాట! ఇలా పక్షం రోజుల నుంచి నగరంలోను, పరిసర ప్రాంతాల్లోనూ సాధారణానికి మించి రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా 6 నుంచి 11 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. ఇలా నాలుగైదు రోజులు కాదు.. రెండు వారాలకు పైగా నిప్పుల వానను తలపించేలా ఉష్ణోగ్రతలు రికార్డవుతూ ఈ ఏడాది అసాధారణ వేసవిని తలపించాయి.

అనూహ్యంగా మారిన వాతావరణం

ఇలా ఇంటా బయటా సెగలు కక్కుతున్న వాతావరణంతో జనం అల్లాడిపోతున్న తరుణంలో సోమవారం పరిస్థితిలో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఇన్నాళ్లూ సూర్యోదయానికి ముందే సుర్రుమనించే భానుడు సోమవారం శాంతించాడు. బాగా పొద్దెక్కినా చల్లదనాన్నే పంచాడు. మరోవైపు వడగాడ్పులకు బదులు చల్లని గాలులూ వీచాయి. సోమవారం విశాఖ నగరంలో 36.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం నాటి ఉష్ణోగ్రతతో పోల్చుకుంటే దాదాపు 8 డిగ్రీలు తక్కువ. దీంతో వేసవి ఛాయలు లేని వాతావరణంతో ప్రాణం లేచి వచ్చిందంటూ నగరవాసులు ఎంతో ఊరట చెందుతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి పరిస్థితి లేదంటూ ఆనంద పరవశులవుతున్నారు.

నైరుతి గాలుల వల్లే..

మండుటెండలు, తీవ్ర వడగాడ్పుల నుంచి ఉపశమనం కలగడానికి తాజాగా నైరుతి దిశ నుంచి వీస్తున్న చల్లని గాలులే కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కొన్నాళ్లుగా రాష్ట్రంపైకి వీస్తున్న వేడితో కూడిన పశ్చిమ, వాయవ్య గాలులతో అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులకు కారణమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. కొద్ది రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకూ విస్తరించనున్నాయి. ఈ నేపథ్యంలో వీస్తున్న నైరుతి గాలులతో ఉష్ణోగ్రతలు క్షీణిస్తున్నాయి. ఫలితంగా ఎండలు, వడగాడ్పుల తీవ్రత తగ్గి చల్లని వాతావరణం నెలకొంటుందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి ఒకరు 'సాక్షి'కి చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'పై త్వరలో వర్క్‌షాప్

- ప్రతి అర్జీకి సంతృప్తికరమైన పరిష్కారం ఇవ్వాల్సిందే
- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి
- ప్రజల నుంచి 144 విజ్ఞప్తుల స్వీకరణ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై త్వరలో వర్క్‌షాప్ జరగనుందని, అధికారులంతా తమ విభాగాల పరిధిలో వచ్చిన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌వో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన వెబ్‌సైట్‌లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. వచ్చిన ప్రతి అర్జీని 24 గంటల్లోగా పరిశీలించి సంబంధిత అధికారులకు పంపాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలనీ, ఎస్‌ఎల్‌ఏ సమయం ముగియకముందే పిటిషన్‌దారుడితో మాట్లాడి వారికి వివరాలు తెలియజేసి పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలతో ఉండాలని సూచించారు. గడువు తీరినప్పటికి వివిధ శాఖల్లో అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై డీఆర్‌వో ఆరా తీశారు. వెబ్‌సైట్‌తో పాటు 'జగనన్నకు చెబుదాం' లో 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలను తెలియజేస్తున్నారన్నారు. సచివాలయాల స్థాయిలో ఇంకా ఈ సమస్యలను చూడడం లేదని, మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జెడ్పీసీఈవో లాగిన్ అయ్యి సమస్యలను చూసేలా సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు జగనన్నకు చెబుదాంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 144 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూ విభాగానికి 46, జీవీఎంసీ 46, పోలీసు శాఖకు 16, ఇతర విభాగాల నుంచి 36 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితులకు సంతాపం


నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

విశాఖ -లీగల్ : ఇటీవల ఒడిశాలో జరిగిన షాలిమార్ రైలు ప్రమాదంలో మృతులు, క్షతగాత్రులకు సత్వర న్యాయం అందించాలని విశాఖ న్యాయవాద సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు కోరారు. ఈ మేరకు ఆయన న్యాయవాదుల సంఘం సభ్యులతో కలిసి జిల్లా కోర్టు బయట సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి తగిన విధంగా సేవలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద సంఘం నాయకులు దుర్గా నాగశ్రీ, పలక శ్రీరామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, హేమమాలిని, కుమారి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో అర్జీల పరిష్కారం


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 15, జగనన్నకు చెబుదాంకు 88 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో వచ్చిన వినతుల్లో ఇంజినీరింగ్ విభాగానికి 7, టౌన్ ప్లానింగ్‌కు 5, డీసీ (రెవెన్యూ), పబ్లిక్ హెల్త్, యూసీడీకి ఒక్కో ఫిర్యాదు వచ్చిందన్నారు. అలాగే ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన జగనన్నకు చెబుదాంకు(గ్రీవెన్స్) 88 వినతులు వచ్చాయని, వీటిలో రెండో జోన్‌కు 11, మూడో జోన్‌కు 10, నాల్గో జోన్‌కు 6, జోన్-5కు 10, జోన్-6కు 26, జోన్-7కు 3, జోన్-8కి 3 ఫిర్యాదులు రాగా ప్రధాన కార్యాలయానికి 19 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి మూడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, పర్యవేక్షక ఇంజినీర్లు కేవీఎస్ రవి, వినయ్‌కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, రామ్మోహనరావు, డీపీవో చక్రధర్, పీవో (యూసీడీ) సూర్యకళ, డీసీపీలు, ఏసీపీలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 48 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న డీసీపీ(క్రైం) నాగన్న

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ (క్రైం) జి.నాగన్న పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనకు 48 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ (ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడుతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పంచకర్లకు శుభాకాంక్షల వెల్లువ

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు జన్మదిన వేడుకలు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు మధ్య వేడుకలు ఘనంగా జరిగియి. అనంతరం పూల మాలలు, పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ రెహ్మాన్, పార్టీ నేత రవిరెడ్డి , వివిధ అనుబంధ సంస్థల నాయకులు అల్లంపల్లి రాజ బాబు , కంపా హనోక్, పేర్ల విజయచందర్, కాశీ విశ్వనాథం, మొల్లి అప్పారావు , పేడాడ రమణి కుమారి, పీలా వెంకట లక్ష్మి, అడ్దాల కృపా జ్యోతి, మాన్యాల శ్రీనివాస్, అప్పన్న, కేవీ బాబా,నల్లరవి కుమార్, యతిరాజులు నాగేశ్వరావు, నారా నాగేశ్వరావు, చొక్కర శేఖర్, పీలా ప్రేమ్ , రామారావు, మజ్జి జ్యోతి, వెంగళరావు , అజయ్, వెంకటరావు , శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును సత్కరిస్తున్న పార్టీ నేతలు


పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్‌లకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరినందున అక్కడ నుంచి బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరాలో ఈనెల 13వ తేదీన బయల్దేరాల్సిన హౌరా-విశ్వేశ్వరయ టెర్మినల్ బెంగళూరు(22887) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరులో ఈనెల 15వ తేదీన బయల్దేరాల్సిన విశ్వేశ్వరయ టెర్మినల్ బెంగళూరు-హౌరా(22888) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరాలో ఈనెల 14వ తేదీన బయల్దేరాల్సిన హౌరా-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం (22831) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో ఈనెల 16వ తేదీన బయల్దేరాల్సిన శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా(22832) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ విశాఖ బ్రాంచ్ చైర్మన్‌గా వెంకటరెడ్డి


నూతన చైర్మన్ గుజ్జు వెంకటరెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

మద్రిపాలెం (విశాఖ ఉత్తర) : మిలట్రీ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్) బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం బ్రాంచ్ చైర్మన్‌గా గుజ్జు వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎలక్షన్ చైర్మన్ మేజర్ పి.ఆర్ రావు (రిటైర్డ్) తెలిపారు. రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్న గుజ్జు వెంకటరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.



ఘనంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి జన్మదిన వేడుకలు


భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆశీర్వదిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు సోమవారం చిట్టివలస బంతాట మైదానంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కేక్ కట్ చేయించి ఆశీర్వదించి శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కొండా రాజీవ్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఎలక్ట్రానిక్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. అభిమానులు, నాయకులు ముత్తంశెట్టిని పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, బీసీ కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, దొలపల్లి ఏడుకొండలు, రెండోవార్డు ఇంచార్జ్ శిల్లా సరళారాణి, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, నాయకులు అక్కరమాని రామునాయుడు, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, జీరు సుజాత, ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

- స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా

డాబాగార్డెన్స్ : నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ఆర్కే బీచ్‌రోడ్డు, హనుమంతువాక నుంచి సింహాచలం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డును జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రూపామిశ్రా మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా బీఆర్‌టీఎస్ పరిధిలో వ్యర్థాలు లేకుండా చూడాలని, మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను యార్డులకు తరలించాలని, ప్రతి ఇంటి నుంచి తడి-పొడి చెత్త సేకరణ పక్కాగా జరగాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. బీచ్‌లో సందర్శకులు, పర్యాటకులు వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాల వ్యర్థాలు డస్ట్‌బిన్‌లలో వేసేలా చూడాలన్నారు. వ్యాపారస్తులు తమ షాపుల ముందు తప్పని సరిగా 2 డస్ట్ బిన్లు ఉంచాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి. సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, డీసీపీ పద్మజ, జోనల్ కమిషనర్ మల్లయ్య, పబ్లిక్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పెందుర్తి నుంచి ఆనందపురం వెళ్లే మార్గంలో ఉన్న డీఆర్ కళాశాలలో విద్యుత్ షాక్‌కు గురై సాయికుమార్ అనే యువకుడు మృతి చెందాడు. అలాగే వడ్లపూడి పరిధిలోని ఎరుకులవీధిలో ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో కృష్ణారావు మృతి చెందాడు.

కూర్మన్నపాలెం : విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పాత వడ్లపూడి పరిధిలోని ఎరుకులవీధి ప్రాంతానికి చెందిన దేవాడి కృష్ణారావు (47) బిల్డింగ్‌లకు చిప్పింగ్ వర్క్ చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం కూర్మన్నపాలెం పరిధి వుడా ఫేజ్-6లో ఓ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా చిప్పింగ్ వర్క్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కొత్త ఇల్లు నిర్మాణంలో ఉండడం వల్ల సంఘటన స్థలంలో ఎవరూ లేరు. దీంతో ఇంటి ఓనర్ వచ్చి చూసేసరికి కృష్ణారావు కిందపడి ఉండడంతో వెంటనే అతనిని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే కృష్ణారావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కృష్ణారావుకు భార్య శ్రీదేవి, కూతురు హారిక, కొడుకు మనోజ్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు కృష్ణారావు

డీఆర్ కళాశాలలో..

సింహాచలం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం పెందుర్తి నుంచి ఆనందపురం వెళ్లే మార్గంలో ఉన్న డీఆర్ కళాశాల (మేజర్ డిఫెన్స్ అకాడమీ)లో చోటుచేసుకుంది. డీఆర్ కళాశాలలో విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన బి.సాయికుమార్ (25) నాలుగు నెలలుగా పనిచేస్తున్నాడు. కళాశాల ప్రాంగణంలోని గోడపై జెండాలు కట్టేందుకు నిలబడగా హెచ్‌టీ లైన్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్ మృతికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ పలువురు సంఘటన స్థలంలో ఆరోపించారు. ఈ సంఘటనపై ఇంకా పోలీసు కేసు నమోదు కాలేదు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల సందడి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం బదిలీలు చేస్తున్నారు. ఒకే దగ్గర రెండేళ్లు పూర్తి చేసుకున్న వారికి రిక్వెస్టు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ గడువు సోమవారంతో ముగిసింది. భార్యాభర్తలు, అనారోగ్య బాధితులకు బదిలీల్లో తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇటీవల ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలో సుమారు 140 మందికి పరస్పర బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు నోడల్ అధికారిగా మొత్తం మూడు జిల్లాల సిబ్బందిని బదిలీ చేయవలసి ఉంది. మొత్తం అన్ని కేడర్లకు సంబంధించి 43 దరఖాస్తులు అందాయి.

ఏళ్ల తరబడి తిష్ట వారికి స్థానచలనం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌వో), వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, వివిధ అనుబంధ సంస్థల కార్యాలయాల్లో ఏళ్ల తరబడి తిష్ట వేసిన వారికి బదిలీలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో బదిలీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో బదిలీలను వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులు ఉమ్మడి జిల్లాల్లో 35 మంది వరకు ఉన్నట్టు గుర్తించారు.

హోంగార్డు దుర్మరణం

- ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదం


కుమారస్వామి(ఫైల్) (ఇన్‌సెట్‌లో) హోంగార్డు ఎస్.కుమారస్వామి మృతదేహం


భర్త మృతదేహం వద్ద రోధిస్తున్న భార్య హైమ

సబ్బవరం/అనకాపల్లిటౌన్ : మండలంలోని కాపుశెట్టివానిపాలెంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు సబ్బవరపు కుమారస్వామి (36) మృతి చెందారు. అనకాపల్లి గ్రామీణ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలివి. కుమారస్వామి సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సబ్బవరం రహదారి ఇరువాడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకుని వచ్చినట్లు ఎస్ఐ చెప్పారు. ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచి సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో అనకాపల్లి నుంచి సబ్బవరం స్టేషన్‌కు వెళుతుండగా కాపుశెట్టివాని పాలెంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన నిర్మించిన కాలువలో పడిపోయింది. దీంతో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి భార్య హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. 2009 బ్యాచ్‌కు చెందిన కుమార స్వామి సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో 2012 వరకు పనిచేశారు. అనంతరం ఎస్. రాయవరంలో 18 నెలలు పాటు పని చేసి, 8 నెలల క్రితం సబ్బవరంలో పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

సీఐ నివాళి

సబ్బవరంలో సీఐ రంగనాథం, ఎస్ఐలు ఎల్ సురేష్, ఎ.వెంకటేశ్వరరావుతో పాటు మిగిలిన సిబ్బంది కుమారస్వామికి ఘనంగా నివాళులు అర్పించారు. కుమార స్వామి హఠన్మరణం తమను ఏంతగానో కలిచివేసిందని పోలీసులు ఉద్వేగానికి లోనయ్యారు.

చంద్రయ్యపేటలో విషాద ఛాయలు

కె.కోటపాడు : అనకాపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ఎస్.కుమారస్వామి మృతి చెందడంతో ఆయన స్వగ్రామం చంద్రయ్యపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరితో సరదాగా ఉంటూ, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే కుమారస్వామి మృతి గ్రామస్తులను కలచివేసింది. ఎప్పటిలానే విధులకు వెళ్లిన భర్త సోమవారం ఇంటికి తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న భార్య హైమకు రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందాడన్న సమాచారం తెలిసి భోరున విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. కుమారస్వామికి భార్య హైమావతి, నాలుగేళ్ల కుమార్తె పునీత, మూడేళ్ల కుమారుడు మోక్షిత్ ఉన్నారు. చంద్రయ్యపేటలో కుమారస్వామి మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. అంతకు ముందు కుమారస్వామి భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

ఉద్యోగం పేరిట మోసం

గోపాలపట్నం : ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన సింహాచలం దేవస్థానం ఉద్యోగినిపై గోపాలపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం ఇందిరానగర్‌కు చెందిన సంభాన శ్రీను దివ్యాంగురాలైన తన భార్య ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. సింహాచలం దేవస్థానంలో ఉద్యోగం చేస్తున్న కరోతు రవణమ్మ ఉద్యోగాలు వేయిస్తుందని బంధువుల ద్వారా తెలుసుకున్న శ్రీను ఆమెను సంప్రదించాడు. గతంలో చాలా మందికి ఉద్యోగాలు వేయించానని రవణమ్మ చెప్పడంతో నమ్మి దఫదఫాలుగా రూ.20 లక్షలు ఆమె అకౌంట్‌లో జమ చేశాడు. ఇదంతా 2021-22లో జరిగిందని బాధితుడు తెలిపాడు. ఉద్యోగం గురించి ప్రస్తావించిన ప్రతీసారి మాట దాట వేస్తోందని వాపోయాడు. దీంతో మోసపోయామని గ్రహించి గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శ్రీను చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ-తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో సోమవారం బయల్దేరాల్సిన విశాఖ-తిరుపతి (08583) స్పెషల్‌ను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన ఈ రైలు సుమారు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 11.10 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరింది. అటు నుంచి రావలసిన పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలును రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు


మెడికవర్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పలు ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఐహెచ్ఐపీ పోర్టల్‌లో ఆస్పత్రులు, లేబొరేటరీలు అప్లోడ్ కావాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రైవేట్ ఆస్పత్రులను అప్రమత్తం చేయడానికి తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ మేరకు సోమవారం మెడికవర్, అపోలో, ఎంబీ హాస్పిటల్, పినాకిల్ ఆస్పత్రిని సందర్శించి ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలను కలిసి పోర్టల్‌లో వెక్టార్ బోర్న్ డిసీజెస్, సంక్రమిత వ్యాధుల వివరాలను అప్లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

'పాలిసెట్' ఓరియంటేషన్‌కు 90 మంది హాజరు


ఓరియంటేషన్ తరగతుల్లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఓరియంటేషన్ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల నిర్వహణకు సంబంధించి విద్యార్థుల మొబైల్ నంబర్లకు సమాచారం పంపించారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు ఈ తరగతులు ప్రారంభించారు. దీంతో విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో తరగతులను స్థానిక ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ కె.వెంకటరమణ ప్రారంభించారు. ఈ తరగతుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 90 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈనెల 24వ తేదీ వరకు తరగతులు జరుగుతాయని ఆయన చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సుల వివరాలు ఆసక్తికి అనుగుణంగా వాటిని ఎంచుకునే విధానం, భవిష్యత్‌లో ఉపాధి అవకాశాల వివరాలను ఆయన తెలిపారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో రెండేళ్లలో 545మందికి ఉత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు లభించాయన్నారు. అత్యధికంగా 6.73లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఇక్కడ చదివిన 143మంది బాలికలకు ఉద్యోగాలు పొందినట్లు ఆయన తెలిపారు. వెబ్ ఆప్షన్లనకు సంబంధించి కాలేజీలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.